

యూపీఎస్‌పై యుద్ధభేరి..

యూపీఎస్‌కు వ్యతిరేకంగా నిర్వహించే యుద్ధభేరికి తరలి రావాలని టీఎస్‌సీపీఎ స్పీయూ నేతలు కోరారు.

8లో ▸



సమగ్ర కుటుంబ సర్వే

దుద్యాల్ మండల పరిధిలోని పులిచర్లకుంట తండాలో సమగ్ర కుటుంబ సర్వే గురువారం ప్రారంభమైంది.

8లో ▸



నత్తనడకన పనులు!

దుద్యాల్ గేట్ నుంచి మండల కేంద్రం మీదుగా రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

9లో ▸

న్యూస్‌రీల్

ఎల్లమ్మ సేవలో ఎంపీ డీకే అరుణ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ డీకే అరుణ తదితరులు

దుద్యాల్: జగన్మాత ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎప్పుడూ ఉండాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరుకున్నారు. మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ఆమె గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. హిందూవాదం ప్రధాని మోదీ హయాంలోనే పెరిగిందని చెప్పారు. అనంతరం ఈఓ రాజేందర్ రెడ్డి, చైర్మన్ జయరాములు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, రాములు, బాల్‌రామ్, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, బాలకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ధారూరు: మండల కేంద్రంలో బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ రంజాన్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ ప్రజల సమస్యలపై పోరాడుతుందని, మైనారిటీల సంక్షేమం, వారి అభివృద్ధికి పాటుపడతామని వివరించారు. కార్యక్రమంలో జమీర్‌ఖురేషి, మహబూబ్, నబీ, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



కేజీబీవీలో మాట్లాడుతున్న డీఎస్పీ

యాలాల: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రానున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. అనవసరంగా ఆందోళన చెంది ఒత్తిడికి గురి కాకూడదని చెప్పారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. పదో తరగతి అనంతరం ఇంటర్‌లో చేరే ముందు భవిష్యత్తుకు అనుకూలంగా ఉన్న గ్రూపులో చేరాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గిరి, ఎస్ఓ మంగమ్మ, సీఆర్టీలు కృష్ణవేణి, గీతామాధురి, మమత తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష



నిందితుడు మహ్మద్ ఇద్రీస్

పహాడీషరీఫ్: పోక్సో కేసులో నిందితుడికి ఎల్బీ నగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. 2019లో వాదే ముస్తఫా బస్తీలో ఆడుకుంటున్న బాలుడిపై మహ్మద్ ఇద్రీస్(24) లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధించారు. అదే సమయంలో బాధిత బాలుడికి రూ.3 లక్షల పరిహారం అందించారు. అదనపు పీపీలు సునీత, రఘు వాదనలు వినిపించారు.

నేడు అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు ప్రారంభం

చేవెళ్ల: ఇటీవల చేవెళ్లకు మంజూరైన అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు శుక్రవారం హైకోర్టు జడ్జిలచే వర్చువల్‌గా ప్రారంభం కానుందని చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం చేవెళ్లలో ఉన్న కోర్టు ప్రాంగణంలోనే ఈ కోర్టు ప్రారంభం అవుతుందని చెప్పారు. పలువురు జిల్లా జడ్జిలు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

బర్డ్ ఫ్లూ లేదు.. భయం వద్దు

జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టిన పశుసంవర్ధక శాఖ ● క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తాండూరు: పౌల్ట్రీ రంగాన్ని బర్డ్ ఫ్లూ భయపెడుతోంది. వైరస్ ద్వారా రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 60 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని కోళ్ల ఫారాలను పరిశీలిస్తున్న టీం సభ్యులు వైరస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

14 లక్షల కోళ్ల ఉత్పత్తి

జిల్లాలో ఐదేళ్ల నుంచి పౌల్ట్రీ రంగం అభివృద్ధి చెందుతోంది. అంతకుముందు కొన్ని మండలాలకే పరిమితమైన కోళ్ల ఫారాలు ప్రస్తుతం ఒక బషీరాబాద్ మినహా అన్నిచోట్ల అందుబాటులోకి వచ్చాయి. బ్రాయిలర్ కోళ్ల పెంపకం ద్వారా ఏటా 6 దఫాలుగా ఉత్పత్తి చేయడం లాభాదాయకంగా ఉండేదని నిర్వాహకులు చెబుతున్నారు. మొత్తం 14 లక్షల కోళ్లు ఉత్పత్తి అవుతున్నాయి. కానీ ప్రస్తుతం పౌల్ట్రీ రంగంపై బర్డ్ ఫ్లూ వైరస్ ఎఫెక్ట్ కనిపిస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వైరస్ లక్షణాలు బయటపడ్డాయి. మరోవైపు జిల్లా మీదుగా జాతీయ రహదారి ఉండటంతో నిత్యం పెద్దఎత్తున కోళ్ల రవాణా జరుగుతోంది. దీంతో మహమ్మారి కట్టడికి జిల్లా యంత్రాంగం నడుం బిగించింది.

60 బృందాల ఏర్పాటు

బర్డ్ ఫ్లూ నుంచి కోళ్ల పరిశ్రమను కాపాడేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది. ఫ్లూ సోకకుండా ఎప్పటికప్పుడు కోళ్ల ఫారాలపై నిఘా పెట్టింది. అందులో భాగంగా 60 బృందాలను ఏర్పాటు చేసింది. ఈ టీంలు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆధ్వర్యంలో పని చేస్తాయి. మరోవైపు ఒక్కో టీంలో ఒక పశు వైద్యాధికారి, ఫారా సిబ్బంది, అటెండర్‌లను నియమించి ఇటీవల శిక్షణ ఇచ్చారు. వైరస్ సోకితే చేపట్టాల్సిన చర్యలు, పీపీఈ కిట్‌లు ధరించే విధానంపై అవగాహన కల్పించారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను వేరుపరిచి నిర్వీర్యం చేసే విధానంతో పాటు ఇతర వాటికి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా మండలాల్లో పౌల్ట్రీ రైతులకు వివరిస్తున్నారు.





ఫారాన్ని పరిశీలిస్తున్న పశు వైద్య బృందం

జిల్లా వ్యాప్తంగా కోళ్ల ఫారాల వివరాలు

బ్రాయిలర్	124
లేయర్	6
నాటుకోడి	6
మొత్తం	136

బాగా ఉడికించాలి

పక్షం రోజులుగా బర్డ్‌ఫ్లూ వైరస్ భయంతో మార్కెట్‌లో చికెన్ అమ్మకాలు తగ్గాయి. కిలో ధర రూ.160 నుంచి రూ.190 వరకు మాత్రమే పలుకుతోంది. దీంతో కోడి మాంసంపై నెలకొన్న అపోహలను తొలగించేందుకు చికెన్ మేళాలను పెంపకందారుల సంఘం, యాజమాన్యాలు ఏర్పాటు చేస్తున్నాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు సైతం చికెన్ తినొచ్చని నొక్కి చెబుతున్నారు. బాగా ఉడికిస్తే వైరస్ చనిపోతోందని తర్వాత చికెన్ వంటకాలు తిన్నా ఎలాంటి ఆరోగ్య సమస్య రాదని పేర్కొంటున్నారు.

లక్షణాలు కనిపిస్తే తెలియజేయండి

బర్డ్‌ఫ్లూ వైరస్ మన జిల్లా, చుట్టుపక్కల జిల్లాలో వ్యాప్తి చెందకపోవడంతో కొంత ఊరట కలిగించే అంశం. కోళ్ల ఫారాలలో బర్డ్‌ఫ్లూ వైరస్ ఆనవాళ్లు కనిపించినా, మృత్యువాత పడినా నిర్వాహకులు వెంటనే నంబర్ 91007 97390కు సమాచారం అందించాలి. మరోవైపు కోడి మాంసాన్ని తింటే అనారోగ్యానికి గురవుతామని వదంతులు వస్తున్నాయి. చికెన్‌ను బాగా ఉడికించి తింటే ఎలాంటి భయం లేదు.

– సదానందం, జిల్లా పశువైద్యాధికారి



చన్గోముల్ పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

అసంక్రమిత వ్యాధులపై రీసెర్చ్ బృందం ఆరా

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ రాజేష్, డాక్టర్ సురేష్ బృందం మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తుందని డీఎంహెచ్‌ఓ వెంకటరవణ తెలిపారు. ఈ మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీసిన టీం సభ్యులు నివేదికను ఆరోగ్య మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నారు. ఇందులో భాగంగా గురువారం డీఎంహెచ్‌ఓ ఆయా ప్రోగ్రాం అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, అమలుపై చర్చించారు. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా చన్గోముల్ పీహెచ్‌సీ, మన్నెగూడ ఆరోగ్య ఉపకేంద్రం, పరిగి సామాజిక ఆరోగ్య కేంద్రం, దోమ పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన అసంక్రమిత వ్యాధులు, క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, చికిత్స అనంతరం అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

సిబ్బందికి సూచనలు

మాతా శిశు సంరక్షణ సేవలు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు, గర్భిణులు, బాలింతల నమోదు, అవసరమైన సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడటం, ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణులను సిజేరియన్ జరిగేలా చూడటం, స్కానింగ్ సౌకర్యం వంటి వివిధ సౌకర్యాల గురించి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఇంకా రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ బృందంతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జీవరాజ్, రవీంద్రయాదవ్, పీఓలు పవిత్ర, బుచ్చిబాబు, నిరోషా, జానీ, ప్రవీణ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సజావుగా సాగాలని ముడుపు

బొంరాస్‌పేట: పాదయాత్రల భక్తుడిగా పేరుగాంచిన మండల పరిధిలోని రేగడిమైలారానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బలిజ వీరప్ప వరుసగా 14వ సారి పాదయాత్రను ముగించుకున్నారు. ఏటా శివరాత్రికి ముందు స్వగ్రామం నుంచి పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరుతాడు. ప్రతిసారి ఓ మొక్కు మొక్కుకుని ముడుపు కడతాడు. మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్ర చేస్తాడు. ఇలా 2010 నుంచి ఇప్పటి వరకు వరుసగా 14 సార్లు 310 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లి వచ్చాడు. ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన సజావుగా సాగాలని కోరుతూ నల్లమల కోరికల గుట్టపై ముడుపు కట్టానని వీరప్ప తెలిపాడు.



నల్లమలలోని కోరికల కొండ వద్ద వీరప్ప



పార్వతీపరమేశ్వరుల గుట్టపై జరిగిన కల్యాణోత్సవంలో భక్తులు

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

భక్తులతో కిటకిటలాడిన పరమేశ్వరుని గుట్ట



అలంకరణలో ఉత్సవమూర్తులు



ఉత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి గ్రామ సమీపంలో వెలసిన పార్వతీపరమేశ్వరుల గుట్టపై గురువారం కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉత్సవమూర్తులను గ్రామం నుంచి రథంపై ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. ఈ క్రతువును తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా మండలాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. పరమేశ్వరుడి గుట్ట భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మరోవైపు పీరంపల్లిలో బుగ్గ రామలింగేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని చేవెళ్ల జనార్ధన్‌రెడ్డి దంపతులు జరిపించారు.

స్వామివారి సేవలో స్పీకర్

పులుసుమామిడిలో స్వామివారిని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాగునీటికి తండ్లాట

అధికారుల అలసత్వంతో వేసవికి ముందే ఓ గ్రామం తాగునీటికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోంది. ఎండలను దృష్టిలో ఉంచుకొని ముందుస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దానికి నిదర్శనమే కుల్కచర్ల మండలంలోని రాంనగర్ గ్రామం.

- మూడు నెలలుగా అవస్థలు పడుతున్నాం
- వేసవికి ముందే ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన రాంనగర్ గ్రామస్తులు



ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన రాంనగర్ గ్రామస్తులు

కుల్కచర్ల: భానుడు పూర్తిస్థాయిలో ప్రతాపం చూపకముందే తమ గొంతెండుతోందని మండలంలోని రాంనగర్ గ్రామస్తులు రోడ్డెక్కారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం అందరూ కలిసి ఖాళీ బిందెలు, బకెట్లతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మూడు నెలలుగా తమ గోడును ఎవరికి చెప్పుకొన్నా వినే నాథుడే కరువయ్యాడని వాపోయారు. మూడు రోజులకోసారి వచ్చే మిషన్ భగీరథ నీరు తమకు సరిపోవడం లేదని పేర్కొంటున్నారు.

మూడు నెలలుగా ఇబ్బంది

ఆందోళన చేపట్టిన గ్రామస్తులు మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం గ్రామ పరిధిలోని బోరు పాడవడంతో కేవలం మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడ్డారు. కనీసం అధికారులు బోరు మోటారుకు మరమ్మతు చేయించలేదు. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ నీరు మూడు, నాలుగురోజులకు ఒకసారి వస్తుంది. అవి కూడా అపరిశుభ్రంగా రావడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక అధికారులతో పాటుగా ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లామని, అయినా పరిష్కారం కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

స్పందించిన అధికారులు

గ్రామస్తులు తాగునీటి కోసం గురువారం రోడ్డెక్కడంతో ఆయా ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు స్పందించి తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు. రెండురోజుల వరకు ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తామని అనంతరం బోర్లు రిపేరింగ్ చేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



గ్రామంలో ఉన్న బోరు పాడవడంతో తాగడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అందరికి ఉపయోగకరంగా ఉండే బోరు మోటారు, పైపులైన్ మరమ్మతుకు గురవ్వడంతో తాగునీటికి పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్, గ్రామస్తుడు, రాంనగర్

అపరిశుభ్రంగా భగీరథ నీరు



మా ఊరికి మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తుందో తెలియదు. రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తాయి. అవి కూడా ఒక్కోసారి అపరిశుభ్రంగా వస్తున్నాయి. దీంతో అందరం బోరు నీళ్లు లేదా పొలాల దగ్గరకు వెళ్లి తెచ్చుకుని తాగుతున్నాం. అధికారులు స్పందించాలి.

– యాదయ్య, గ్రామస్తుడు, రాంనగర్

మోటారును బాగు చేయిస్తాం



రాంనగర్ గ్రామంలో సమస్యను పరిష్కరించేందుకు తాత్కాలికంగా చర్యలు చేపట్టాం. పాడైన బోరు మోటారును ఒకట్రెండు రోజుల్లో బాగు చేయిస్తాం. అలాగే గ్రామానికి కొత్త బోరు మోటారును ఏర్పాటు చేసేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదన పంపాం.

– రామకృష్ణ, ఎంపీడీఓ, కుల్కచర్ల

ఆక్రమణల పర్వం!

రెచ్చిపోతున్న అక్రమార్కులు

- సర్కారు భూములకు రక్షణ కరువు
- దర్జాగా ఆక్రమిస్తున్న కబ్జారాయుళ్లు
- రూ.కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ఖాళీ స్థలాలే కాదు చెరువులు, కుంటలు, శ్మశానవాటికలు, పార్కులు.. కావేవీ కబ్జాకు అనర్హం అన్నట్లు ఆక్రమణదారుల చెరలోకి వెళ్లిపోతున్నాయి. పట్టాదారులు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను తమ ప్రైవేటు భూమిలో దర్జాగా కలిపేసుకుంటున్నారు. వాటికి గుట్టుగా రికార్డులు సృష్టించి, బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ రాత్రికి రాత్రే కోట్లకు పడగలెత్తుతున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ), తహసీల్దారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించి, ఆయా ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రూ.కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ముఖ్యంగా శంషాబాద్, శేరిలింగంపల్లి, మొయినాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, బాలాపూర్ మండలాల్లోని సర్కార్ భూములకు రక్షణ లేకుండా పోయింది. ఇప్పటికే మెజార్టీ భూములు ప్రైవేటు వ్యక్తుల పరం కాగా, మిగిలిన కొద్ది పాటి భూములకు సైతం రక్షణ కల్పించ లేకపోతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులెవరైనా స్వయంగా ఫిర్యాదు చేస్తే కానీ అధికారులు కూర్చున్న కుర్చీలో నుంచి కదలడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని ఆక్రమణలు

- శంషాబాద్ మండలం పెద్దతూప్రలో 500 గజాల గ్రామకంఠం భూమి కబ్జా.
- తొండుపల్లిల సర్వే నంబర్ 108లో ఆరు ఎకరాలు, సర్వే నంబర్ 109లో 2.03 ఎకరాల ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న పట్టా భూమిలో కలిపే యత్నం.
- రాయన్నగూడ సర్వే నంబర్ 66లోని 6.31 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది.
- గొల్లపల్లి సర్వే నంబర్ 261లోని పది ఎకరాల మిగులు భూమిని ఆక్రమణకు యత్నిస్తున్నారు.
- ఔటర్ రింగ్‌రోడ్డు పక్కనే ఉన్న రాళ్లగూడ సర్వే నంబర్ 626లో రూ.వంద కోట్ల విలువ చేసే ఏడెకరాల ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్నుపడింది.
- కేశంపేట మండలం బైర్కాన్‌పల్లి గ్రామం సర్వే నంబర్ 53లోని డపింగ్‌యార్డ్ సహా నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న పట్టా భూమిలో కలిపే యత్నం.
- చేవెళ్ల మండలం కమ్మెట గ్రామం సర్వే నంబర్ 270లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, చుట్టూ ప్రీకాస్టింగ్ పలకలను అమర్చారు.

కుంటలనూ వదలకుండా..

- ఇబ్రహీంపట్నం మండలం బొంగుళూరు-ఎంపీ పటేల్‌గూడ మధ్యలో పులిందర్‌వాగు 500 మీటర్ల వరకు ఆక్రమణకు గురైంది.
- ఇబ్రహీంపట్నం బొంతపల్లికుంటపై స్థిరాస్తి వ్యాపారుల కన్నుపడింది. ఇప్పటికే మట్టి పోసి కుంటను ఆక్రమించే ప్రయత్నం చేశారు.

క్లుప్తంగా

కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

ధారూరు: గుట్టుచప్పుడు కాకుండా బుధవారం రాత్రి స్టేషన్‌ధారూరు సమీపంలోని టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీకి కలపను తరలిస్తుండగా ఫారెస్టు అధికారులు కాపుకాసి పట్టుకున్నారు. ఫారెస్టు రేంజ్ అధికారి రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీకి తరచూ లారీలు, డీసీఎం, ట్రాక్టర్లలో అక్రమంగా కలపను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అంపల్లి చౌరస్తా వద్ద మాటువేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. అక్రమ కలప తరలింపుపై విచారణ జరుపుతున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఫారెస్టు రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్దవెల్లి గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి గ్రామానికి చెందిన కమ్మరి నర్సింహాచారి తన ట్రాక్టర్ ద్వారా కూలీల సాయంతో ఇసుకను లోడ్ చేస్తుండగా కొంత మంది పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నర్సింహాచారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

గుడికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్ : గుడికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల చేశారు. బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. శ్రీరామ్‌నగర్ కాలనీ, నాదర్‌గుల్‌కు చెందిన పేరం భావ్య బ్యూటీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 26న శివరాత్రి సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల సమయంలో తల్లిదండ్రులు, సోదరుడు రాకేష్‌తో కలిసి కుర్మల్‌గూడలోని శివాలయానికి దర్శనం కోసం వెళ్లింది. అదే సమయంలో ఆమె భర్త రవి, కూతురు కలిసి ఇంటికి తాళం వేసి ఆడబిడ్డ ఇంటికి వెళ్లారు. భావ్య దేవాలయం నుంచి సాయంత్రం 4.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా బయట గేటు, మెయిన్‌డోర్ తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరుచుకొని ఉంది. అందులోని దాచి పెట్టిన ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం 45 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుడి గంటలు అపహరణ

యాచారం: గుడిలో గంటలు మాయమయ్యాయి. మండల పరిధిలోని గాండ్లగూడెంలోని శివాలయం, మల్లికార్జునస్వామి దేవాలయాల్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గంటలను ఎత్తుకెళ్లారు. దేవాలయాల నిర్వహణ చూసే బర్ల కృష్ణ గురువారం ఉదయం గమనించి యాచారం పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రాణాలు తీసిన పైసల పంచాయితీ

- తల్లీకొడులవి ఆత్మహత్యలే
- పోస్టుమార్టంలో ప్రాథమిక నిర్ధారణ
- హత్యకు సంబంధించిన ఆనవాళ్లులేవని తేల్చిన వైద్యులు
- డబ్బుల కోసం తమపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం
- మృతుడి భార్యకు రిమాండ్



మొగులప్ప (ఫైల్)



ఎల్లమ్మ (ఫైల్)

బషీరాబాద్: మండల పరిధిలోని కాశీంపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం కలకలం రేపిన తల్లీకొడుకులు మాల మొగులప్ప, ఎల్లమ్మల మృతి మిస్టరీ వీడింది. ఇద్దరివీ ఆత్మహత్యలేనని జిల్లా ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన పోస్టుమార్టంలో ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుల శరీరాలపై ఎటువంటి రక్తగాయాలు లేవని తేల్చారు. కేసులో అనుమానితురాలుగా ఉన్న మొగులప్ప భార్య రేణుకను బుధవారం అరెస్టు చేసిన పోలీసులు తాండూరు మున్సిఫ్ కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

డబ్బుల కోసం వేధింపులు

కాశీంపూర్‌లో గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మొగులప్పకు వారం రోజుల క్రితం రెండు నెలలకు సంబంధించి రూ.18 వేల జీతం వచ్చింది. ఈ పైసలు(డబ్బులు) తనకు ఇవ్వకుండా తల్లీకొడుకులు వాడుకున్నారని రేణుక వారితో గొడవ పడింది. ఇదే విషయమై మొగులప్పపై బషీరాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన తల్లీకొడుకులు గత ఆదివారం రాత్రి ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మొగులప్ప మృతదేహాన్ని తీస్తున్న క్రమంలో మర్మాంగాల నుంచి రక్తస్రావం కావడంతో ఇవి హత్యలేనంటూ బంధువులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన తెలిపారు. దీంతో ఇద్దరి బాడీలను పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. ఇరువురి శరీరాలపైనా హత్య చేసినట్లు ఆనవాళ్లు లేవని, మొగులప్పకు ఇంటర్నల్‌గా జరిగిన బ్లీడింగ్ కారణంగా రక్తం బయటకు వచ్చిందని వైద్యులు తేల్చారు. గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బుధవారం రేణుకను రిమాండ్‌కు తరలించినట్లు మీడియాకు వెల్లడించలేదని పోలీసులు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన ప్రకటన విడుదల చేశారు.

దిక్కులేని పక్షులైన పిల్లలు



నందకిషోర్, వెన్నెల

తండ్రి మొగులప్ప, నాయనమ్మ ఎల్లమ్మ మృతిచెందడం, తల్లి రేణుకను పోలీసులు రిమాండ్‌కు తరలించడంతో ఇద్దరు పిల్లలు నందకిషోర్(10), వెన్నెల(7) దిక్కులేని పక్షులయ్యారు. వీరు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుతం మేనత్త నర్సమ్మ సంరక్షణలో ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శివపార్వతుల కల్యాణ ఘట్టం



శివపార్వతుల పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

- వైభవంగా భూకైలాస్ శివపార్వతుల కల్యాణం
- నేటితో ముగియనున్న ఉత్సవాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండాలో వెలసిన భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు కొనసాగు తున్నాయి. మూడోరోజు గురువారం శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల పల్లకీ సేవ చేపట్టారు. పల్లకీ ముందు భక్తులు చేసిన పలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహిత శంకర్‌నాయక్ పవార్ దంపతులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భూకైలాస్‌లో గురువారం కూడా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా నీటిమార్గం ద్వారా భక్తులు వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అగ్నిగుండంలో నడిచిన భక్తులు

భూకైలాస్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకుడు వాసు పవార్‌నాయక్‌తో పాటు భక్తులు అగ్నిగుం డంలో నడిచారు. భూకైలాస్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శుక్రవారం భవానీమాత పూజతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

పులిచర్లకుంటలో సమగ్ర కుటుంబ సర్వే

దుద్యాల్: పులిచర్లకుంట తండాలో సమగ్ర కుటుంబ సర్వే గురువారం ప్రారంభమైంది. కొన్ని రోజులుగా ఈ తండాకు చెందిన గిరిజనులు లగచర్ల ఘటనలో బాధితులుగా ఉన్న నేపథ్యంలో జైలులో శిక్షను అనుభవించారు. వారి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై తండాను విడిచి ఇతర గ్రామాల్లో తలదాచుకున్నారు. దీంతో సమగ్ర కుటుంబ సర్వే ఆ తండాలో నిలిచిపోయింది. ప్రస్తుతం ఆ తండాలో గిరిజనులు అందుబాటులో ఉండడంతో తండాకు చెందిన 40 కుటుంబాల వివరాలను పంచాయతీ కార్యదర్శి ఆనంద్ సేకరించారు. వారి వివరాలను త్వరలోనే ఆన్‌లైన్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో గోపాల్ నాయక్, ప్రవీణ్ రాథోడ్, పాండ్యా నాయక్, మాణిక్యనాయక్, బోజ్యా నాయక్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు వద్దు..



పులిచర్లకుంట తండాలో సర్వేలో అధికారులు

మా గిరిజనుల భూములు గుంజుకోవాలని చూస్తే ఊరుకోమని, అందుకే మాకు ప్రభుత్వ పథకాలు వద్దని, మా భూములు మాకు ఉంటే చాలని తండావాసులు వాపోతున్నారు. సమగ్ర కుటుంబ సర్వే కోసం గతంలో అధికారులు వస్తే సహకరించలేదన్నారు. ప్రస్తుతం అధికారులు వివరాలు సేకరిస్తుంటే వారికి సహకరిస్తున్నామని గిరిజనులు చెబుతున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేరళ బృందం డాక్టర్ సురేశ్‌కుమార్

- భారత ప్రభుత్వ అధికారుల (కేరళ) బృందం కితాబు
- దోమ పీహెచ్‌సీతో పాటు బొంపల్లి సబ్ సెంటర్ సందర్శన

దోమ: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతున్నాయని భారత ప్రభుత్వ అధికారుల (కేరళ) బృందం కితాబిచ్చింది. గురువారం దోమ మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు బొంపల్లి సబ్ సెంటర్‌ను వారు సందర్శించారు. పరిసరాలు, రికార్డులను తనిఖీ చేసిన వారు.. డెలివరీ, ఫార్మసీ, ల్యాబ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం వైద్య బృందంతో సమావేశం ఏర్పాటు చేసి రోగులకు అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇవ్వడంపై సేవలు బాగున్నాయని కేరళ బృందం డాక్టర్లు సురేశ్‌కుమార్, రాజేశ్, నాయర్ స్థానిక వైద్య సిబ్బందిపై హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత లేకుండా ఉద్యోగాల భర్తీ చేయడం, వైద్య సేవలు మెరుగు పరచడం తదితర ప్రభుత్వ చర్యలతో మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నామని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగికి నిరంతరం వైద్యం అందిస్తూ సరైన మందులు అందించాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జీవరాజు, రవీంద్రయాదవ్, ఎంసీహెచ్ అధికారి డాక్టర్ పవిత్ర, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ ప్రవీణ్, గైనకాలజిస్ట్ డాక్టర్ బీబీజాన్, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ నిరోష, కో ఆర్డినేటర్లు రేణుకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి మహేశ్, పీహెచ్‌సీ డాక్టర్ రజిత, బొంపల్లి పల్లెదవాఖాన డాక్టర్ అఖిల్, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, హెచ్‌ఈఓ ప్రభులింగం, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో గురువారం డివిజన్‌లోని వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది గర్భిణులను గుర్తించాలని అన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలతో కలిగే లాభాలను వివరించాలన్నారు. గ్రామాల్లో 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయాలన్నారు. వైద్యులు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసలు, వైద్యాధికారులు అమృత జోసెఫ్, హరికిషన్, స్రవంతి, రాఘవేందర్, నికిత, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

చెరువులో మునిగి వ్యక్తి మృతి

కీసర: కుటుంబ సభ్యులతో కలిసి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు వచ్చిన ఓ వ్యక్తి చెరువులో నీట మునిగి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బోయిన్‌పల్లి సిక్ విలేజ్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఆర్జీ వీరేష్(43) కుటుంబ సమేతంగా ఈనెల 24న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు వచ్చి, గుట్టపైనే బస చేశాడు. గురువారం తన బావమరిది మహావీర్, కుమారుడు వికాస్‌తో కలిసి పెంపుడు కుక్కకు స్నానం చేయించేందుకు గుట్ట దిగువన ఉన్న నూర్ మహ్మద్ చెరువుకు వెళ్లారు. ఈత రాకపోవడంతో మహావీర్, వికాస్ గట్టుపైనే ఉన్నారు. తనకు ఈత వచ్చని చెప్పిన వీరేష్ దుస్తులు విప్పి చెరువులోకి దుకాడు. లోతు ఎక్కువగా ఉండటంతో ఒక్కసారిగా నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గట్టుపై ఉన్న వారు కేకలు వేయడంతో అక్కడికి వచ్చిన స్థానికులు వారిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న గాలింపు చేపట్టి వీరేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ పరికరాలకు అంచనా శిబిరం

అనంతగిరి: దివ్యాంగులకు సంబంధించిన పరికరాలను అందించేందుకు అంచనా శిబిరాన్ని వచ్చే నెల 03 నుంచి 05 వరకు నిర్వహించనున్నట్లు ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని ధర్మ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ఏడీఐపీ పథకం కింద గుర్తించబడిన, అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచితంగా సహాయకాలు, ఉపకరణాలను అందించడం కోసం జిల్లాలో భారత ప్రభుత్వ ఏడీఐపీ పథకం కింద బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రై సైకిల్స్, హ్యాండ్ ప్రొపెల్డ్ ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు సూచించడానికి మూడు రోజుల పాటు శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగివారు వైకల్య ధ్రువీకరణ పత్రం అన్ని సహాయకాలు, ఉపకరణాలకు కనీసం 40 శాతం వైకల్యం తప్పనిసరి కలిగి ఉండాలన్నారు. సంబంధిత దివ్యాంగ లబ్ధిదారుడు లేదా వారి సంరక్షకుల నెలవారీ ఆదాయం రూ.22,500 కంటే తక్కువ ఉన్నట్లు చూపించే రుజువు పత్రం కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 8179432874 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

కుల్కచర్ల: కుల్కచర్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని అంగడిబజార్‌లోని పీఏసీఎస్ పంక్షన్‌హాల్లో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

ఎంపీ అనిల్ కుమార్ గైర్హాజరు

- పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది కుర్మ నరేందర్
- తదుపరి విచారణ మార్చ్ 6కు వాయిదా

సిటీ కోర్టులు : 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌పై నమోదైన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు ఆయన గైర్హాజరయ్యారు. పలు సమావేశాల నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరు కాలేకపోతున్నారని తరుపు న్యాయవాది కుర్మ నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను మార్చి 6కు వాయిదా వేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల కోర్టు సూచించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌యాదవ్ తన అభిమానులు, కార్యకర్తలతో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా అడిక్‌మెట్ నుంచి రాంనగర్ గుండు వరకు సమారు 100 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారని, రోడ్డుపై టపాకులు కాల్చడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు మరో నలుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

పిల్లల విక్రయం కేసులో మరో ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: చైతన్యపురి ఠాణా పరిధిలో సంచలనం సృష్టించిన పిల్లల అక్రమ రవాణా, విక్రయం కేసులో పోలీసులు మరో ముగ్గురు మధ్యవర్తులను అదుపులోకి తీసుకున్నారు. జువైనల్ చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దీంతో నిందితుల సంఖ్య 14కు చేరింది. గుజరాత్‌కు చెందిన ప్రధాన సూత్రధారి వందన, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రముఖ దళారిగా వ్యవహరిస్తున్న కృష్ణవేణి కోలాలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఉమారాణి, జయశ్రీ, సోనీ కీర్తిలను అరెస్టు చేశారు. వీరు పిల్లలను గుజరాత్ నుంచి అక్రమంగా రైలు, బస్సులలో తీసుకొచ్చి, తెలుగు రాష్ట్రాల్లో సంతానం లేని దంపతులకు విక్రయిస్తున్న ముఠాకు అప్పగిస్తున్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి వందన కోసం ప్రత్యేక బృందాలు ఉత్తరాది రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలిస్తున్నాయి.

యూపీఎస్‌పై యుద్ధభేరికి తరలిరండి

పోస్టర్ విడుదల చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

తాండూరు టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతను విచ్ఛిన్నం చేసే ఏకీకృత పింఛన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన యుద్ధభేరికి తరలి రావాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్ పాషా పిలుపు నిచ్చారు. గురువారం మార్చి 2వ తేదీన నిర్వహించనున్న యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్‌ను తాండూరు పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల యూపీఎస్ పింఛన్ విధానానికి ఆమోదం తెలిపిందన్నారు. దీని వల్ల ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం యుపీఎస్‌ను అమల్లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అది అమల్లోకి వస్తే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. యూపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న యుద్ధభేరి ధర్నా కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సాహిత్య సభ్యులు మురహరినాథ్, మల్లేశ్, శ్రీధర్, సంతోష్ పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.



యుద్ధభేరి పోస్టర్ విడుదల చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు



ఖాంజాపూర్‌లో ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ నగేశ్

- రూరల్ సీఐ నగేశ్
- ఖాంజాపూర్ వద్ద ఇసుక ట్రాక్టర్ల తనిఖీలు

తాండూరు రూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ నగేశ్ హెచ్చరించారు. గురువారం తాండూరు మండలం ఖాంజాపూర్ గ్రామ శివారులోని కాగ్నా వాగును ఆయన పరిశీలించారు. ఖాంజాపూర్ వాగు నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేశారు. ఇసుక పర్మిషన్, డ్రైవర్ల లైసెన్స్, ఇన్సూరెన్స్ కాగితాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..పర్మిషన్ ఉన్నచోటే ఇసుకను డంప్ చేయాలని డ్రైవర్లకు సూచించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేయాలన్నారు. డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పర్మిట్లు ఇచ్చి..పత్తాలేని అధికారులు..

వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఇచ్చిన తర్వాత చేతులు దులుపుకుంటున్నారు. అనుమతులు ఇచ్చిన ప్రాంతంలో ఇసుక డంప్ చేస్తున్నారా? లేదా ? అని తెలుసుకోకుండానే ఇష్టంవచ్చినట్లు అనుమతులు ఇవ్వడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. జినుగుర్తి గ్రామంలో నిర్వహించనున్న సీసీరోడ్డు పనుల కోసం నాలుగు ట్రాక్టర్లకు గురు, శుక్రవారాలకు అనుమతులు ఇచ్చామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి అనుమతులతో రెండురోజులకంటే ఎక్కువ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లపై తట్టెడు మట్టి వేయలేదు



రావులపల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కోసం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఆర్‌అండ్‌బీ, పంచాయత్ రాజ్ శాఖ రోడ్లపై తట్టెడు మట్టి వేయలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మోమిన్‌పేట్ మండలం కేసారం గ్రామచౌరస్తా నుంచి బంట్వారం మండలం తొర్మామిడి వరకు 11కిలో మీటర్ల వరకు రూ.3.49 కోట్లతో చేపట్లనున్న రోడ్డు మరమ్మతుల పనులకు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గూడేం రాములు యాదవ్, కాంగ్రెస్ బ్లాక్-2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ కలిసి రావులపల్లి, కల్‌ఖోడ గ్రామాల్లో శిలా ఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్పీకర్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నియోజక వర్గంలోని రోడ్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, ప్రతిఒక్కరూ కాంగ్రెస్‌కే ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలి

ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలోని పితాంబరేశ్వర 25వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పార్వతి పరమేశ్వరుల కల్యాణానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్మాణదాత అనంత్‌రెడ్డి పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

ధారూరు: గుర్తు తెలియని ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధారూరు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. తాండూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీరేశం తెలిపిన వివరాల ప్రకారం.. ధారూరు రైల్వేస్టేషన్ నుంచి తాండూరుకు వెళ్లే మార్గంలో 89వ కిలోమీటర్ వంతెన దగ్గర గుర్తు తెలియని యువకుడు(25) రైలు పట్టాల మధ్యన పడుకున్నాడు. ఈ లైన్‌లో వెళుతున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రైల్వే గ్యాంగ్‌మెన్ ఇచ్చిన సమాచారంతో తాండూర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీరేశం సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా నిర్ధారించామని, తాండూర్ రైల్వే ఆస్పత్రిలో మృతదేహాన్ని భద్రపరుస్తామని తెలిపారు. మృతుడి ఒంటిపై స్పోర్ట్స్ బ్లూకలర్ పాయింట్, బ్లాక్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని తెలిపారు.